

# హైదరాబాద్ వార్త

> “ గృహజ్యోతి పథకంలో భాగంగా హైదరాబాద్‌లో తొలుత 11లక్షలమంది వినియోగదారులకు వర్తించే అవకాశం ఉన్నట్లు తెలుస్తుంది. ఎందుకంటే వీరి వివరాలన్నీ సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్‌కు చేరాయి. కావున మార్చినెలలో వీరికి మాత్రమే జీరో బిల్లులు జారీ కానున్నాయి. ఇందులో అత్యధికంగా హబ్సిగూడ సర్కిల్‌లో 1.47లక్షలమంది వినియోగదారులకు లబ్దిచేకూరనుంది.

# గృహజ్యోతి వెలుగులు

**200 యూనిట్లలోపు లబ్దిదారులకు జీరో బిల్లులు**

**ఇంటింటికీ తిరిగి అందజేస్తున్న విద్యుత్ సిబ్బంది**

**పదిరోజుల్లో పూర్తి చేసేలా అధికారుల చర్యలు**

**9 సర్కిళ్లలో 11 లక్షలమంది వినియోగదారులకు లబ్ది**



**ముషీరాబాద్‌లో మహిళలకు జీరో బిల్లును అందజేస్తున్న హైదరాబాద్ సెంట్రల్ ఎస్ఈ బ్రహ్మం, విద్యుత్ సిబ్బంది**

హైదరాబాద్, మార్చి 1, ప్రభాతవార్త: రాష్ట్రంలో కాంగ్రెస్ సర్కార్ ఎంతో ప్రతిష్ఠాత్మకంగా తీసుకు వచ్చిన ఆరు గ్యారంటీల్లో ఒకటైన గృహ జ్యోతి పథకం అమల్లోకి వచ్చింది. ఈపథకం కింద వినియోగదారులకు జీరో బిల్లులు జారీ ప్రక్రియ మార్చి1 (శుక్రవారం)నుంచి ప్రారం భమైంది. మీటర్ రీడర్లు ఇంటింటికి వెళ్ళి రీడింగ్‌ను తీసి 200యూనిట్లలోపు బిల్లువచ్చిన వినియోగదారులకు జీరో బిల్లులు అంద జేస్తున్నారు. ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకుని తెల్లరేషన్‌కార్డుతో, ఆధార్‌కార్డు అనుసంధానం చేసుకున్న వారికి ఈజీరో బిల్లులను అందజే స్తున్నారు. ఈ ప్రక్రియ పదిరోజులపాటు సాగు తుందని డిస్కం అధికారులు తెలిపారు. అలాగే జీరో బిల్లులు రానివారు తిరిగి జిహెచ్ఎంసి సర్కి ల్ కార్యాలయాల్లో, మండల కార్యాలయాల్లో ప్రజావాణి పోర్టల్ దరఖాస్తు చేసుకో వాలని సూచించారు. అలాగే యజమానుల పేరున ఉన్న ఇంటి కనెక్షన్, అద్దెకు ఉండే వారి పేరు మీద మార్పు చెందదని, అద్దెకున్న వారిని అప్లికేషన్ చేసుకో వద్దని ఒత్తిడి చేయాల్సిన అవసరం లేద న్నారు. వారికి రేషన్‌కార్డు ఉండి, సగటున 200 యూనిట్లన్న వరకు విద్యుత్ వినియో గిస్తే దర ఖాస్తు చేసు కోవాలని సూచించారు. కాగా గ్రేటర్ పరిధిలో 9 సర్కిళ్లలో 49.50లక్షల గృహ కనెక్షన్లు ఉండగా అందులో 19.85లక్షలమంది మాత్రమే ఈపథకం కోసం దరఖాస్తు చేసుకు న్నారు. ఇందులో మ్యాపింగ్ ప్రక్రియ 11లక్షల వరకు జరిగింది. అయితే ఈనెలలో నెలలో జారీ అయిన జీరో కరెంట్ బిల్లుల ఆధారంగానే అర్హుల సంఖ్యపై స్పష్టత వచ్చే అవకాశం ఉన్నట్లు అధి కారులు తెలిపారు. ప్రస్తుతం విద్యుత్ ఛార్జీల ప్రకారం లెక్కిస్తే నెల లో కచ్చితంగా 200యూనిట్లు వాడుకునే వారికే దాదాపు రూ.900 వరకు ఆదా కానున్నట్లు తెలుస్తుంది.

**200 యూనిట్లు దాటితే మొత్తం చెల్లించాల్సిందే**

గృహజ్యోతి పథకం కేవలం 200 యూనిట్ల లోపు వినియోగానికే ఉంటుందని ఆపై ఒక్క యూనిట్ వాడకం పెరిగినా.. మొత్తానికి బిల్లు చెల్లించాల్సి ఉంటుంది. వినియోగదారులకు జీరో బిల్లు జారీ చేసినప్పుడు 200యూనిట్ల లోపు ఉన్నా ..ఆతర్వాత నెలలో 200యూనిట్లకు ఒక్కయూనిట్ ఎక్కువ వాడినా 201 యూనిట్లకు బిల్లులు చెల్లించాల్సి ఉంటుంది.. అలాగే టారిఫ్ మారిపోయి బిల్లు పెరిగిపోతుంది. అలాగే మరుసటి నెలలో మళ్ళీ 200లోపు నమోదైతే మళ్లీ జీరో బిల్లు జారీ చేయబడుతుంది. గతప్రభుత్వంలో ఇలాగే ఎస్సీ,ఎస్టీ లకు 101 యూనిట్లదాకా ఉచిత విద్యుత్ అమల్లో ఉంది. ఈపథకంలో వినియోగదారులకు ఒక్క యూనిట్ దాటి -102 వాడినా మొత్తం బిల్లు కట్టాలి. అయితే ఇప్పుడు ఎస్సీ,ఎస్టీ పథకంలో ఉన్నవారు కూడా ఇకపై గృహజ్యోతిలో భాగంగా 200యూనిట్ల ఉచిత విద్యుత్‌ను వాడుకోవచ్చని అధికారులు తెలుపుతున్నారు.

**గ్రేటర్‌లో 11 లక్షలమందికి లబ్ది**

గృహజ్యోతి పథకంలో భాగంగా హైదరాబాద్‌లో తొలుత 11లక్షలమంది వినియోగదారులకు వర్తించే అవకాశం ఉన్నట్లు తెలుస్తుంది. ఎందుకంటే వీరి వివరాలన్నీ సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్‌కు చేరాయి. కావున మార్చినెలలో వీరికి మాత్రమే జీరో బిల్లులు జారీ కానున్నాయి. ఇందులో అత్యధికంగా హబ్సిగూడ సర్కిల్‌లో 1.47లక్షలమంది వినియోగదారులకు లబ్దిచేకూర నుంది. హైదరాబాద్ సౌత్‌లో 1.27, బంజారా హిల్స్‌లో 59,000 వినియోగ దారులకు గృహజ్యోతికోసం వివరాలు ఇవ్వగా మిగతా సర్కిళ్లలో లక్షలోపే ఉన్నారు. అయితే ప్రజాపాల నలో 19.85లక్షల దరఖాస్తులు వచ్చినప్పటికీ ఒకో ఇంట్లోనే రెండు ఆర్జీలు రావ డం, వేర్వేరు పోర్షన్లలో నాలుగు కుటుంబాలకు కలిపి అందరికీ ఒకటే మీటర్ ఉండటం, ఊర్లో ఇక్కడ దరఖాస్తు చేసుకోవడం, అద్దెదారుల వివరాలతో మ్యాపింగ్ చేసేందుకు కొందరు యజమానులు ఒప్పుకోకపో వడం వంటి సమస్యలతో మిగతా దరఖాస్తుల వివరాలు నమోదు కాలేదని విద్యుత్ సిబ్బంది చెబుతున్నారు.

# డేంజర్ డెంగీ

**నగరంలో విషజ్వరాలు విజృంభిస్తు న్నాయి. డెంగీ, విష జ్వరాలతో ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. కాలనీలు, బస్తీలు అనే తేడా లేకుండా విషజ్వరాలతో బాధపడుతున్నవారి సంఖ్య ఒక్కసారిగా గణనీయంగా పెరిగింది. జ్వరాలతో రోగులు ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులకు పరుగులు తీస్తున్నారు. నగరంలో ఫీవర్, ఉస్మానియా, గాంధీ ఆసుపత్రుల వద్ద రోగుల రద్దీ విపరీతంగా ఉంది.**

నగరాన్ని వణికిస్తున్న విష జ్వరాలు

ఆసుపత్రుల్లో పెరుగుతున్న బాధితులు

ముందస్తు జాగ్రత్తతోనే నివారణ సాధ్యం



హైదరాబాద్, మార్చి 1 ప్రభాతవార్త : చిన్నారుల నుంచి పెద్దల వరకు డెంగీ బారిన పడుతు న్నారు. ఏ ఆసుపత్రిలో చూసినా ఈ వ్యాధితో చేరిన వారే ఎక్కువగా కనిపిస్తున్నారు. విషజ్వ రాలు, డెంగ్యూ వంటి వ్యాధులు రాకుండా అన్ని ముందు జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు చెబుతున్నా వారి మాటలు నీటిమూ టలుగా మారుతున్నాయి. విషజ్వరాలతో, డెంగ్యూతో చిన్నపిల్లలు ఎక్కువగా ఆస్పత్రులు పాలవుతున్నారు. నగరంలోని నిలోఫర్, ఫీవర్ ఆస్పత్రులలో పాటు ప్రైవేటు ఆసుపత్రులలో విషజ్వరాలు, డెంగ్యూ బారినపడిన వారు చికిత్స పొందుతున్నారు. ఈ వ్యాధులకు ప్రమాదన కారణం దోమలు అని తెలిసి వాటిని పూర్తిగా నివారించి ప్రజలకు రక్షణ కల్పించాల్సిన అధికారులు నామమాత్రపు చర్యలు చేపడుతూ చేతులు దులుపుకుంటున్నారు. విషజ్వ రాలు డెంగ్యూ బారినపడుతున్నది ఎక్కువగా మురికివాడలకు చెందిన పిల్లలే కావడంతో వారిలో పేద వారు ప్రభుత్వ ఆసుపత్రులకు ఆశ్రయిస్తుండగా, కొద్దిగా స్తోమత ఉన్నవారు ప్రైవేటు ఆసుపత్రులలో చికిత్స పొందుతున్నరు. విష జ్వరాలో అంత పెద్ద ప్రమాదం లేప్పటికీ డెంగ్యూతో పెద్ద ప్రమాదం ఉందని వైద్యులు చెబుతున్నారు. డెంగ్యూ జ్వరం 'ఏడిస్ ఈజిప్ట్' అనే ఆడ దోమ పగటి పూట నొప్పిరాకుండా కుట్టడం వల్ల వస్తుందని, నియో బిబిసి చిల్డ్రన్ ఆస్పత్రి ఎండి, ప్రముఖ పిల్లల వైద్యనిపుణలు డాక్టర్ మంజుకొండ రంగయ్య పేర్కొన్నారు. డెంగ్యూ బారిన పడకుండా పిల్లలకు పూర్తి రక్షణ కల్పించాలని ప్రతి ఇంటిలో దోమల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. డెంగ్యూ వ్యాధికి కారణం, వ్యాధి రాకుండా తీసుకునే జాగ్రత్తలను ఆయన వివరించారు.

**డెంగ్యూ లక్షణాలు..** డెంగ్యూ వ్యాపించినప్పుడు చలితో అతి జ్వరం మొదల వుతుంది. ఒళ్లు నొప్పులు, ఎముకల నొప్పులు ఉంటాయి. విపరీతమైన తల నొప్పి, కనుగుడ్లు లాగడం, శరీరం కమిలిపోవడం, శరీరంపై దుద్దులు రావ డం, చిన్న పిల్లలకు గొంతు నొప్పి, వాంతులతో మొదలు కావచ్చు. ఈ జ్వరా న్ని అశ్రద్ధ చేస్తే రెండవ స్టేజికి డెంగ్యూ హెమరేజిక్ ఫీవర్‌గా మారుతుందని డాక్టర్ రంగయ్య వివరించారు. డెంగ్యూ హెమరేజ్ ఫీవర్‌గా మారితే రక్తస్రావం కావడం, శరీరం నుంచి చిగుర్ల ద్వారా ముక్కు ద్వారా, చిన్న పేగులతో, మూత్రపిండాలలో, చర్మంలోగాని రక్తస్రావం కావచ్చని తెలిపారు. అతిగా కడుపులో నొప్పి, వాంతులు, హై ఫీవర్ లక్షణాలు ఉంటాయని తెలిపారు. ఊపిరితిత్తులలో నీరు రావడం, బిపి తగ్గిపోవడం, నాడిబలహీనం కావడం, శ్వాస ఇబ్బందిగా ఉండడం, ఇతర అవయవాలు చెడిపోయే అవకాశం ఉంటుందన్నారు.

**డెంగ్యూ వ్యాధికి తీసుకోవాల్సిర జాగ్రత్తలు..** డెంగ్యూ వ్యాధిని అశ్రద్ధచేస్తే ప్రాణాంతకమవుతుంది. డెంగ్యూ లక్షణాలను కొందరు అమ్మవారు అనుకొని ఎలాంటి చికిత్స చేయించరని, దీనితో అది ముదిరిపోతుందని ,ఆదశలో ఆస్పత్రికి తీసుకెళ్లినా కొన్నిసార్లు ప్రయోజనముండదని వైద్యులు పేర్కొం టున్నారు. అనుభవమున్న వైద్యులు డెంగ్యూను తొందరగా గుర్తిస్తారని, కొన్నిసార్లు వైరల్ జబ్బులు కూడా డెంగ్యూ మాదిరిగానే కనిపిస్తాయని, ఇలాంటప్పుడు కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. రక్త పరీక్షల్లో తెల్లరక్తకణాలు తక్కువగా రావడం, రక్తం చిక్కపడడం వల్ల డెంగ్యూ హెమరేజ్ జ్వరం నుంచి షాక్ సింద్రోమ్ వెళుతున్నట్లు సూచిస్తుందన్నారు. డెంగ్యూ నివారణకు వ్యాక్సిన్ లేదని, ఒకసారి కుట్టిన దోమ కుట్టబోయిన వైరస్ అదే వ్యక్తికి రెండవసారి వేరే వైరస్ దోమ కుట్టినట్లయితే డెంగ్యూ వ్యాధి తీవ్రంగా వ్యాపించే అవకాశముందన్నారు. ఈ వ్యాధికి ఎలాంటి యాంటిబయాటిక్ మందులు లేదని, కేవలం సపోర్టు ట్రీట్‌మెంట్ అనగా ఐ ఫ్లుయిడ్స్ మాత్రమే వాడాలని పేర్కొంటున్నారు. డెంగ్యూ వైరస్‌తో ఉన్న దోమ వంద గజాల కంటే ఎక్కువ దూరం పోలేదని, ఆ దోమ ద్వారా మనిషికి వైరస్‌చేరి అదే వ్యక్తి ఇతర ప్రాంతాలకు వెళ్ళినప్పుడు అరోగ్యమైన దోమ ఆవ్యక్తి నుంచి వైరస్ తీసుకొని ఇతరులకు కుట్టినప్పుడు వ్యాధి సోకుతుందన్నారు.

## కోకాపేట్‌లో టిప్పర్ బీభత్సం వ్యక్తి దుర్మరణం



నార్సింగి, మార్చి 1 ప్రభాతవార్త : కోకాపేట్‌లో ఓ టిప్పర్ బీభత్సం సృష్టించింది. అతివేగంగా దూసుకు వచ్చి ఓ వ్యక్తిని ఢీకొట్టడంతో ఆయన అక్కడికక్కడే దుర్మ రణం చెందాడు. ఈ విషాదకర సంఘటన నార్సింగి పోలీసు స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... కరీంనగర్ జిల్లా గన్నేరు వరం గ్రామానికి చెందిన మునిగంటి కరుణాకర్(45) డిసిఎం డ్రైవర్‌గా పని చేస్తాడు. ఇతడు 28.ఫిబ్రవరి 2024.రానరతి పదిన్నర గంటల ప్రాంతంలో గండిపేట మండలం కోకాపేట్ మూవీ టవర్స్ వద్ద రోడ్డు దాటుతుండగా అతి వేగంగా దూసుకు వచ్చిన టిప్పర్(టిఎస్08యుడి 6559) ఢీకొట్టడంతో కింద పడ్డాడు. ఇతడి తలపై నుంచి టిప్పర్ వెళ్లడంతో తల పగిలి అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. విష యం తెలుసుకున్న నార్సింగి పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి మృతదేహంను పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. ప్రమాదానికి కారణమైన టిప్పర్ డ్రైవర్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతూ మృతుడు కరుణాకర్ భార్య సుశీల నార్సింగి పోలీసులకు ఫిర్యాదు చేసింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## పంజాగుట్ట శ్మశాన వాటికలో పనులు పూర్తి చేయాలి

**అధికారులకు జిహెచ్ఎంసి కమిషనర్ రోనాల్డ్‌రోస్ ఆదేశం**



హైదరాబాద్, ఫిబ్రవరి 1, ప్రభాతవార్త: పంజాగుట్ట స్మశాన వాటికలో అసంపూర్తి పనులను వెంటనే పూర్తిచేయాలని కమిషనర్ రోనాల్డ్‌రోస్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఉదయం కార్పొరేటర్ మన్నె కవితతో కలిసి కమిష నర్ పంజా గుట్ట స్మశానవాటిక, వెంకటేశ్వర కాలనీలో పర్యటించారు. ఈసందర్భంగా పలు సమస్యలను కార్పొరేటర్ కమిషనర్ దృష్టికి తెచ్చారు. స్మశాన వాటికలో కొత్తగా అభివృద్ధి కోసం చేపట్టిన అసంపూర్తి పనులకు అనుమతి ఇస్తూ నేటి నుంచి పనులను చేపట్టాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. అంతేకాకుండా ఆఫీస్ గది మిగిలిన పనులకు కూడా కమిషనర్ మంజూరు చేస్తూ పనులను యుద్ధ ప్రాప తిపదికన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. సింగిడి కుంట నాలా అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని, అదేవిధంగా నాలాబాక్స్‌డ్రైన్ పనులు ప్రజలకు ఇబ్బంది లేకుండా పూర్తి చేయాలని ఆదేశించారు. బంజారాహిల్స్ రోడ్‌నెంబర్ 10లో గల డిస్పుట్ స్థలంలో మల్టీలెవల్ పార్కింగ్ నిర్మాణానికి , తట్టిఖాన రిజర్వాయర్‌సైట్ వద్ద మల్టీ లెవల్ పార్కు నిర్మాణా నికి చర్యలు తీసుకోవాలని టౌన్‌ప్లానింగ్ అధికారులను ఆదేశించారు.

**మానవత్వం చాటుకున్న ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్**

**పరీక్షకు వెళుతూ ప్రమాదానికి గురైన విద్యార్థినికి తన వాహనంలో తీసుకెళ్లి చికిత్స..****2లో**

## అప్పుడే పుట్టిన శిశువును వదిలి పెట్టి వెళ్లిన గుర్తు తెలియని మహిళలు



యాకుత్‌పుర, మార్చి 1 ప్రభాతవార్త : హైదరాబాద్ పాత బస్తీలోని మౌలాకా సిల్లా ప్రాంతంలో అప్పుడే పుట్టిన శిశు వును గుర్తు తెలియని వ్యక్తులు విడిచి పెట్టి వెళ్లిన సంఘటన శుక్రవారం రెయిన్‌బజార్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. శుక్రవారం ఉదయం ఆరు గంటల సమయంలో గుర్తు తెలియని ఇద్దరు మహిళలు అప్పుడే జన్మించిన శిశువును రెయిన్‌బజార్ పోలీస్ స్టేషన్ పరిధిలోని మౌలాకాసిల్లా ప్రాంతంలో విడిచి పెట్టి వెళ్లి పోయారు. శిశువు ఏడుస్తుండటంతో స్థానికులు గుర్తించి ఈ విషయాన్ని రెయిన్‌బజార్ పోలీసులకు తెలిపారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని శిశువును నగరంలోని నిలోఫర్ ఆసుపత్రికి తరలించారు. ఈ కేసును రెయిన్‌బజార్ పోలీసులు అన్ని కోణాలు నుంచి దర్యాప్తు చేస్తున్నారు.

## శిల్పారామానికి పూర్వ వైభవం తీసుకువస్తాం

**నిథిమ్, శిల్పారామంను సందర్శించిన పర్యాటక శాఖమంత్రి జూపల్లి**



గచ్చిబౌలి, మార్చి 1 ప్రభాతవార్త: హైటెక్‌సిటీ పరిధిలోని గచ్చిబౌలి నేషనల్ ఇనిస్టి ట్యూట్ ఆఫ్ టూరిజం అండ్ హాస్పిటాలిటీ మేనేజిమెంట్(నిథిమ్), మాదాపూర్ శిల్పారా మాన్ని శుక్రవారం తెలంగాణ రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి క్రిష్ణారావు సందర్శించారు. నిథిమ్‌లో అందుబాటులో ఉన్న వసతులను పరిశీలించడంతో పాటు ఇక్కడ టూరిజం కోర్సులు చేస్తున్న విద్యార్థు లతో మాట్లాడారు. విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను, వారి డిమాండ్లను త్వరలో నే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా మంత్రి జూపల్లి మాట్లాడుతూ ఆధునిక ఆర్థిక వ్యవస్థ లో పర్యాటక, ఆతిధ్య రంగానికి ప్రాధాన్యం పెరుగుతుం దని, నేటి యువతకు ఈ రంగాల్లో ఉపాధి అవకాశాలు సైతం పెరుగుతున్నాయన్నారు. హోటల్ మేనేజిమెంట్ కోర్సులు చేసిన యువతకు సులువుగా ఉద్యోగాలు లభిస్తు న్నాయన్నారు. తమకు అందుతున్న ప్రపంచ స్థాయి సౌక ర్యాలను, బోధనను విద్యార్థులు సద్వినియోగం చేసుకో వాలని, తెలంగాణ పర్యాటక రంగాన్ని అగ్రస్థానంలో నిలి పేందుకు కృషి చేయాలని సూచించారు. మాదాపూర్‌లోని శిల్పారామాన్ని సందర్శించిన మంత్రి జూపల్లి శిల్పారామం నిర్వహణ, అభివృద్ధిపై అధికారులతో చర్చించారు. శిల్పారామానికి పూర్వ వైభవం తీసుకువచ్చేం దుకు తమ ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. గత ప్రభుత్వ హయాంలో శిల్పారామం నిర్వహణ అస్థవ్యస్థంగా మారిందని, శిల్పారామం ఆదాయం పెరిగే విధంగా అధ్యయనం చేస్తు న్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో నిథిమ్ డైరెక్టర్ కె.నిఖిల, టిఎస్‌టిడిసి ఎండి సురేష్ నాయుడు, శిల్పారా మం ప్రత్యేక అధికారి కిషన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

## డ్రైనేజీ లైన్, వర్షపు నీటి ప్రవాహానికి అడ్డుగా ప్రహారీ గోడ నిర్మాణం.. పట్టించుకోని అధికారులు

నిలిచిపోయిన వర్షపు, డ్రైనేజీ పైపులైన్ల నీటి మార్గం

ఈపీఎఫ్ క్వార్టర్స్ అధికారుల తీరుపై జీహెచ్ఎంసీ కమిషనర్‌కు, స్థానికుల ఫిర్యాదు

**డ్రైనేజ్, వర్షపు నీరు పోయే మార్గంపైన ఈ పీ ఎఫ్ క్వార్టర్ల అధికారులు అడ్డుగా ప్రహారీ గోడ నిర్మించడంతో ఆ ప్రాంతం లో నుంచి వెళ్లాల్సిన డ్రైనేజ్, వర్షపు నీటి ప్రవాహానికి అంతరాయం ఏర్పడింది. ఈ సమస్య గడచిన కొన్ని నెలలుగా నెలకొన్ని ఉన్నా సంబంధిత వాటర్ వర్క్స్అధికారులు గానీ జీహెచ్ఎంసీ అధికారులు కూడా పట్టించుకోకపోవడంతో బేగంపేట బ్రాహ్మణవాడీ లైన్ నెంబర్ 1లో నివసిస్తున్న పలు కుటుంబాలు తీవ్ర దుర్గంధం వెదజల్లుతున్న డ్రైనేజీ నీరు,దోమల వ్యాప్తితో సతమతమవు తున్నారు.**



**డ్రైనేజీ, వర్షపు నీరు వెళ్లే లైన్ పైన ప్రహారీ గోడ నిర్మించడంతో నిల్చిపోయిన డ్రైనేజీ నీరు**

బేగంపేట, మార్చి 1. ప్రభాతవార్త : ఈ సమస్య గడచిన కొన్ని నెలలుగా సంబంధిత అధికారుల దృష్టికి తీసికెళ్లినా వారు పట్టించుకోకపోవడంతో తాము ఇంటి నుంచి బయటకు కాలు పెట్టాలన్నా.. డ్రైనేజీ నీటిలో దిగి పోవాల్సి వస్తుందని వారు ఆరోపిస్తున్నారు. ఇళ్ల ముందు డ్రైనేజీ నీరు నిల్చి ఉండ టంతో అవి తీవ్ర దుర్వాసన వెదజల్లుతుందని స్థానికులు వాపోతున్నారు. వాటర్ వర్క్స్ అధికారుల తీరు బ్రాహ్మణవాడీ బస్తీ వాసులకు శాపంగా మారింది. ఈ పీఎఫ్ క్వార్టర్స్ అధికారులు బేగంపేట బ్రాహ్మణవాడీ లైన్ నెంబర్ 1 కు చెందిన డ్రైనేజీ, వర్షపు నీటి లైన్ పై ప్రహారీ నిర్మించడంతో డ్రైనేజీ నీరు నిల్చిపోయి ప్రజలు ఇంటి నుంచి బయటకు రాకపోకలు సాగించలేని దుస్థితి నెలకొంది. ఈ విషయాన్ని స్థానికులు జీహెచ్ఎంసీ కమీషనర్‌కు ఫిర్యాదు చేసారు. బ్రాహ్మణవాడీ మెయిన్ రోడ్డు నుంచి బేగంపేట నాలాను కలుపుతూ పబ్లిక్ రోడ్డు ఉంది. బేగంపేట నాలాను కలుపుతూ ఈ లేన్‌లో మొదటి నుంచి డ్రైనేజీ లైన్, రెయిన్ వాటర్ లైన్లు ఉన్నాయి. ఈ పీఎఫ్ అధికారులు తమ నివాస గృహాల కోసం ఈ రహదారిపై కాంపౌండు వాల్ నిర్మిస్తున్న సమయంలో బస్తీ వాసులు వర్షపు నీటి, డ్రైనేజ్ నీటి ప్రవా హానికి అంతరాయం కల్గించవ ద్దంటూ విజ్ఞప్తి చేసారు. అయినా వారు ప్రహారీ నిర్మించారు. దీని వల్ల లేన్ నెం 1 డెడ్‌ఎండ్‌లేన్‌గా మారింది. డ్రైనేజీ పొంగి ప్రవహించి నప్పుడల్లా.. వేరే మార్గం లేకపోవడంతో ఈ అవుట్ లెట్ గుండా వెళ్లాల్సి ఉంది. అయితే గోడ నిర్మాణంతో నీటి సరఫరా నిల్చిపోయింది. లేన్ నెంబర్ 1లో మ్యాన్‌హోల్స్ నుంచి డ్రైనేజ్ వాటర్ పైకి ఉబికి వస్తుంది. ఇది తీవ్ర దుర్వా సన వెదజల్లుతుందని స్థానికులు ఆందోళణ వ్యక్తం చేస్తున్నా రు. బేగంపేట రైల్వేస్టేషన్, ఇతర ప్రాంతాల నుంచి వచ్చే వర్షపు నీరు గోడ నిర్మించిన ప్రాంతంలో నిల్చిపోతుంది. దీంతో ఈ గల్లీ లోని ఏ ఇంటి ముందు చూసినా డ్రైనేజీ నీరు నిల్చి ఉండి, దుర్వాసన వెదజల్లుతుందని, దోమలు కూడా అధిక సంఖ్యలో వస్తున్నాయని స్థానికులు వాపోతున్నారు. ఈ సమస్యపై జీహెచ్ఎంసీ కమిషనర్ దృష్టి సారించాలని, వాటర్‌వర్క్స్ అధికారులు ఈ సమస్యకు పరిష్కారం చూపా లని బ్రాహ్మణవాడీ లైన్ నెంబర్ 1 బస్తీవాసులు కోరుతున్నారు.

## కేంద్రంలో బిజెపి ప్రభుత్వం 3వ సారి రావడం ఖాయం

**సినీ నటి ఖుష్బూ సుందరి**



**ఖుష్బు సుందరికి జ్ఞాపికను అందజేస్తున్న బిజెపి నేత శ్రీగణేష్, శ్యాంసుందర్‌గౌడ్, కార్పొరేటర్ కొంతం దీపిక తదితరులు**

కంటోన్మెంట్, మార్చి1 ప్రభాతవార్త: కేంద్రంలో ఎన్డీయే ప్రభుత్వం 3వ సారి ఏర్పాటు కాబోతుందని, ప్రధాని మోడీ దేశం కోసం అహర్నిశలు పాటు పడుతున్నారని సినీనటి, బిజెపి జాతీయ నాయకురాలు ఖుష్బు సుందర్, మహంకాళి జిల్లా అధ్యక్షుడు శ్యామ్ సుందర్ గౌడ్, కంటోన్మెంట్ ఇన్‌ఛార్జి ఎన్.శ్రీగణేష్‌లు పిలుపునిచ్చారు. బిజెపి తలపెట్టిన విజయ సంకల్ప యాత్రలో భాగంగా బోయిన్‌పల్లి జి.వి.ఆర్. గార్డెన్‌లో నిర్వహించిన సమావే శానికి వారు ముఖ్య అతిథులుగా హాజరై ప్రసంగించారు. బిజెపి ప్రభుత్వ హయాంలోనే దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించిందన్నారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్, బిఆర్ఎస్ పార్టీలకు తగిన గుణపాఠం చెప్పి రాష్ట్రంలో 17 సీట్లు కైవసం చేసుకునేందుకు కార్యకర్తలు, నాయకులు కలిసి కట్టుగా పనిచేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మాజీ మంత్రి కృష్ణ యాదవ్, మాజీ ఎంపీ చాడ సురేశ్ రెడ్డి, మోండా డివిజన్ కార్పొరే టర్ కొంతం దీపిక, బిజెపి నాయకులు మేకల సారం గపాని, బి.ఎన్.శ్రీనివాస్, భానుక నర్మధ మల్లికార్జున్, రామారావు, పరశరామ్, నాగినేని సరిత, రాయల్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రపంచ దృష్టిని ఆకర్షించే విధంగా హైదరాబాద్ మెట్రోరైలు విస్తరణ

హైదరాబాద్ మెట్రోరైల్ ఎండి డాక్టర్ ఎన్‌విఎస్.రెడ్డి



**కార్యక్రమంలో పాల్గొన్న హైదరాబాద్ మెట్రోరైల్ ఎండి డాక్టర్ ఎన్‌విఎస్.రెడ్డి, అదనపు డీజీపీ షికాగోయెల్**

చిక్కడపల్లి, మార్చి 1ప్రభాతవార్త: హైదరాబాద్ మెట్రోరైల్‌ను విస్తరింపచేయడంలో రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో చిత్తశుద్ధితో ముందుకు సాగుతోందని హైదరాబాద్ మెట్రోరైల్ ఎండి డాక్టర్ ఎన్‌విఎస్.రెడ్డి అన్నారు. ప్రపంచం దృష్టిని ఆకర్షించే విధంగా హైదరాబాద్ మెట్రోరైల్ వంటి ప్రజారవాణా వ్యవస్థ ద్వారాప్రజల జీవనోపాధి, నివాసయోగ్యత పెంచడానికి ఎంతో మేలు చేసే ప్రాజెక్టు అని అన్నారు. శుక్రవారం స్టేక్‌హోల్డర్ల కోసం మెట్రోరైలు భవన్‌లో 'టెక్నాలజీస్ ఫర్ అర్బన్ ట్రాన్సిట్ టు ఎన్‌హాన్స్ మొబిలిటీ అండ్ సేఫ్ యాక్సెసిబిలిటీ (టియుటిఈఎం) అనే అంశంపై మొదటి దశ వర్క్‌షాప్ నిర్వహించింది. ఇటీవల జరిగిన అంతర్జాతీయ పోటీలో 'ప్రయాణీకుల భద్రతయాప్ సంబంధిత ప్రొటోకాల్‌ల అభివృద్ధి' కోసం టియుటిఈఎం ప్రాజెక్టుకోసం టియుటిఈఎం ప్రాజెక్ట్ బిట్స్ హైదరాబాద్ క్యాంపస్, ఐఐటి ముంబై, ఖరగ్‌పూర్ ద్వారా సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టింది. ఆసియా డెవలప్‌మెంట్ బ్యాంక్ నుంచి ఇటీవల రూ.3.30కోట్ల గ్రాంట్‌ను డాక్టర్ ఎన్‌విఎస్. రెడ్డి నేతృత్వంలో గెలుచుకుంది. ఈ సందర్భంగా జరిగిన సభలో డాక్టర్ ఎన్‌వి ఎస్.రెడ్డి మాట్లాడుతూ నగరాల జీవనోపాధి, ప్రజారవాణావ్యవస్థప్రాముఖ్యతను హైలైట్ చేశారు. ప్రజారవాణా వ్యవస్థ విజయం సాధించడంలో ఫీడర్ సేవల భద్రత, భద్రత యాప్‌ను అభివృద్ధి చేయడంలో పాల్గొన్న ప్రొఫెసర్‌లు, విద్యార్థులను సాధారణంగా ప్రయాణికులకు, భద్రతకు సంబంధించిన సమస్యలకు వినూత్న పరిష్కారాలు అందిం చాలని, ప్రధానంగా మహిళా ప్రయాణీ కులను పరిగణలోకి తీసుకోవాలని సూచిం చారు. ఈ ప్రాజెక్టు నెలకొల్పడానికి ముందు భద్రతకు సంబంధించిన సమస్యలను అధిగమించడానికి ప్రాథమిక సర్వేను హైదరాబాద్, కోల్‌కతా నగరాల్లో యాప్‌ను ప్రయాణీకులను ఆందోళను దృష్టిలో ఉంచుకుని అభివృద్ధిచేయడం ప్రారంభించడం జరిగిందని,ఇది ప్రధానంగా స్మార్ట్‌ఫోన్, సాధారణ ఫోన్‌లలో వినియోగాన్ని కలిగి ఉంటుందన్నారు. 'యాప్' సురక్షితమైన ఫీడర్ సర్వీస్ రూట్ల ఎంపిక, సులభమైన నావిగేషన్ కోసం ల్యాండ్‌మార్క్‌లు, మెరుగైన భద్రత కోసం ప్రయాణీకులను జత చేయడం కష్టాల్లో ఉన్న ప్రయాణీకులు పోలీసులతో, తెలిసిన వ్యక్తులతో కనెక్ట్ అవ్వడానికి స్పీడ్ డయల్ సౌకర్యం తదితర వాటిని ఎనేబుల్ చేస్తుందన్నారు. రాష్ట్ర మహిళా భద్రతా విభాగం అదనపు డీజీపీ షికాగోయెల్ మాట్లాడుతూ హైదరాబాద్ నగరానికి సురక్షిత నగరంగా మార్చేందుకు తెలంగాణ పోలీసులు చేస్తున్న కృషి ఎంతో గొప్పదన్నారు.

**మిగతా సిటీ 3వ పేజీలో**

# మానవత్వం చాటుకున్న ట్రాఫిక్ ఇన్స్ పెక్టర్

**పరీక్షకు వెళుతూ ప్రమాదానికి గురైన విద్యార్థినికి తన వాహనంలో తీసుకెళ్లి చికిత్స**






ప్రమాదానికి గురైన విధ్యార్థినికి సరైన సమయంలో ఆస్పత్రిలో చికిత్స చేయించిన ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ ఉపాశంకర్

బేగంపేట మార్చి 1,ప్రభాతవార్త : పరీక్షలు రాసేందుకు వెళ్తూ రోడ్డు ప్రమాదానికి గురైన ఇంటర్ విద్యార్థినికి ప్రధమ చికిత్స అందించి సరైన సమయంలో పరిక్షా కేంద్రానికి తీసికెళ్లి మంచి తనాన్ని చాటుకున్నారు మహంకాళీ ట్రాఫిక్ ఇన్స్ పెక్టర్ ఉపాశంకర్. వివరాలిలా ఉన్నాయి. శుక్రవారం ఇంటర్ మొదటి సంవత్సరం పరిక్ష రాసేందుకు నగరానికి చెందిన జి.భవాని అనే విధ్యార్థిని తన తండ్రితో కల్సి మోటారు సైకిల్ పై వెళ్తుంది.సికింద్రాబాద్ ఎంజీ రోడ్డు మార్గంలో ఉన్న ఓ కళాశాల వద్ద బైక్ అదుపు తప్పి వారిద్దరూ కింద పడిపోయారు. ఈ ప్రమాదంలో విధ్యార్థిని తలకు గాయాలయ్యాయి. ఆ ప్రాంతంలో విధులు నిర్వర్తిస్తూ ప్రమాదాన్ని గమనించిన మహంకాళీ ట్రాఫిక్ ఇన్స్ పెక్టర్ ఉపా శంకర్ స్పందించి గాయపడిన విధ్యార్థినిని తన వాహనంలో దగ్గరలోని ఓ ఆస్పత్రికి తీసికెళ్లి ప్రధమ చికిత్స చేయించారు.తిరిగి సరైన సమయంలో పరిక్షా కేంద్రానికి తీసికెళ్లారు. రోడ్డుపైన జరిగిన ప్రమాదాన్ని గమనించి వెంటనే స్పందించిన మహంకాళీ ట్రాఫిక్ ఇన్స్ పెక్టర్ ఉపాశంకర్‌ను బేగంపేట ట్రాఫిక్ అడిషినల్ డీసీపీ సాలె రంగారావు అభినందించారు. తనను సకాలంలో ఆస్పత్రికి తీసికెళ్లి పరిక్షకు సరైన సమయానికి చేర్చిన ట్రాఫిక్ ఇన్స్ పెక్టర్ కు విధ్యార్థిని తో పాటు వారి కుటుంబం కృతజ్ఞతలు తెలియజేసారు. ఘటనపై స్పందించిన ఉపాశంకర్‌ను పలువురు అభినందిస్తున్నారు.

# కుడా స్టేడియంలో శ్రీ హారేక్రిష్ణ నామ్ సంకీర్తన



చార్మినార్, మార్చి, ప్రభాతవార్త : హైదరాబాద్ పాతబస్తీ కులీకుతుబ్ షా స్టేడియంలో మార్చి నెల 2,3 తేదీలలో రెండు రోజుల పాటు హైదరాబాద్ హారేక్రిష్ణ నామ్ సంకీర్తన కమిటి ఆధ్వర్యంలో అత్యంత వైభవంగా సర్భోజనిన్ హారేక్రిష్ణ నామ్ సంకీర్తన కార్యక్రమాన్ని నిర్వహించనున్నామని తెలంగాణ బెంగాలీ సమితి అధ్యక్షులు దీపాంకర్ పాల్ తెలిపారు.ప్రతీ సంవత్సరం మాదిరిగానే ఈఏడాది కూడ ఘనంగా శని, ఆదివారాలు కుడా స్టేడియంలో శ్రీ హారేక్రిష్ణ నామ్ సంకీర్తన, మహతి భాగవతి కార్యక్రమాలు జరగనున్నాయనిఆయన తెలియజేశారు. రెండ రోజుల పాటు శ్రీ హారేక్రిష్ణ నామ్ సంకీర్తన,భజన,భాగవత్ పఠనం,అన్న ప్రసాదం వితరణ తదితర కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని, ఆదివారం ఉదయం కులీకుతుబ్ షా స్టేడియం నుంచి ఊరేగింపు ప్రారంభమై ఘాన్సీ బజార్, చార్‌కమాన్,గుల్జారాహౌస్, చార్మినార్, లాడ్‌బజార్,మిట్టికాషేర్,కోకరివాడి ప్రాంతాలు మీదుగా కొన సాగిన అనంతరం తిరిగి కుడా స్టేడియంకు చేరుకుంటుందని దీపాంకర్ పాల్ వెల్లడించారు.

# పదవీ విరమణ కార్యక్రమంలో పాల్గొనడం ఆనందంగా ఉంది



ఎఫ్‌సీఐలో పదవీ విరమణ చేసిన వెంకటయ్య యాదవ్‌ను సన్మానిస్తున్న కార్పొరేటర్ సబీహా గౌసుద్దీన్

యూసుఫ్‌గూడ, మార్చి 1, ప్రభాతవార్త : విధి నిర్వహణలో ఎంతో క్రమ శిక్షణతో విధులు నిర్వహించి తోటి కార్మికులకు అన్ని వేళల వెన్నంటు ఉంటూ వెంకటయ్య యాదవ్ పదవీ విరమణ కార్యక్రమంలో పాల్గొనడం తనకు ఎంతో ఆనందంగా ఉందని కార్పొరేటర్ సబీహా గౌసుద్దీన్ అన్నారు. రామా రావు బస్తీకి చెందిన బస్తీ అధ్యక్షులు వెంకటయ్య యాదవ్ ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(ఎఫ్‌సీఐలో) 42 సంవత్సరాలుగా విధులు నిర్వహిస్తూ తోటి హమాలీ కార్మికుల యూనియన్‌లో పనిచేస్తూ సుమారు 600 మంది కార్మికులకు తన వెంట ఉన్న కార్మికులను కలుపుకుని పోతూ వారి సమస్యలను ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులతో చర్చించి సమస్యల పరిష్కారానికి కృషి చేసేవారని గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయనను ఘనంగా సన్మానించారు. ఆయనతో పాటు బి.యాదగిరి, ధర్మారావు, సుబ్బారావులు పదవీ విరమణ చేశారు. ఈ కార్యక్రమంలో సమైక్య యూనియన్ అధ్యక్షుడు శర్మ, ఖలీద్ అహ్మద్, బీసీ సెల్ నియోజకవర్గం అధ్యక్షులు నాగుల సత్యం, ఆవుల సంజీవ, సాంబశివ, రాజు, గణేష్‌నగర్ అధ్యక్షులు పన్నాల రాజశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# 104 ఉద్యోగుల సమస్యలు వెంటనే పరిష్కరించాలి

**సీఐటియూ ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్**



ధర్నానుద్దేసించి ప్రసంగిస్తున్న సీఐటియూ ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్

ధర్నాచౌక్, మార్చి 1, ప్రభాతవార్త: 104 ఎఫ్‌డిహెచ్‌ఎస్ స్కీం ఉద్యోగుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని సీఐటియూ ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఇందిరా పార్క్ ధర్నాచౌక్‌లో తెలంగాణ యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో 104 ఎఫ్‌డిహెచ్‌ఎస్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాకు ముఖ్య అతిధిగా హాజరై పాలడుగు భాస్కర్ మాట్లాడుతూ 104 ఎఫ్‌డీహెచ్‌ఎస్ ఉద్యోగులు 2008 నుండి డీఎస్‌సీ ద్వారా రూల్ ఆఫ్ రిజర్వేషన్, రోస్టర్ పాయింట్ పద్ధతిలో జీవో నెంబర్ 1636, మెమో నెంబర్ 20639 ప్రకారం పూర్తిగా ప్రభుత్వ ఆధీనంలోనే పనిచేస్తున్నారని గుర్తు చేశారు. 104 ఉద్యోగులు ఎలాంటి ఉద్యోగభద్రత లేకుండా చాలీ చాలని వేతనాలతో సేవలు అందిస్తున్నారని తెలిపారు. ఈ ధర్నా కార్యక్రమంలో కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల రాష్ట్ర అధ్యక్షులు జే.వెంకటేష్, అధ్యక్ష కార్యదర్శులు ఎం.డీ ఫసియుద్దీన్, కే.యాదనాయక్, గౌరవాధ్యక్షులు భూపాల్, కోశాధికారి కవిత, 104 యూనియన్ నాయకులు విజయవర్ధన్ రాజు, విద్యాసాగర్, నవీన్, సుభాష్‌చంద్ర, శ్రీనివాస్, మన్మాదరావు, రాజేష్ పాల్గొన్నారు.

# పెండింగు స్కాలర్‌షిప్ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తా

**తెలంగాణ ప్రైవేట్ డిగ్రీ కళాశాలల యాజమాన్య అసోసియేషన్ నూతన అధ్యక్షుడు డాక్టర్ బాలకృష్ణారెడ్డి**



బాలకృష్ణారెడ్డిని సత్కరిస్తున్న దృశ్యం

చిక్కడపల్లి, మార్చి 1 ప్రభాతవార్త: తెలంగాణ రాష్ట్రంలో ప్రైవేట్ డిగ్రీ కళాశాల యాజమాన్య సమస్యల పరిష్కారానికి తన వంతు కృషిచేస్తానని తెలంగాణ ప్రైవేట్ డిగ్రీ కళాశాలల యాజమాన్య అసోసియేషన్ నూతన అధ్యక్షుడు డాక్టర్ బాలకృష్ణారెడ్డి వెల్లడించారు. శుక్రవారం బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞానకేంద్రంలో అసోసియేషన్ నూతన అధ్యక్ష ఎన్నిక కార్యక్రమంజరిగింది. ఈ సమావేశంలో అసోసియేషన్ చీఫ్ ప్యాట్రన్ రాజజేశ్వర్‌రెడ్డి, తెలంగాణ ప్రైవేట్ జూనియర్ కళాశాలల యాజమాన్య సంఘం(టిపిజెఎం) అధ్యక్షుడు గౌరిసతీష్, ప్రధాన కార్యదర్శి విష్ణువర్ధన్‌రెడ్డి, ఉస్మానియా విశ్వవిద్యాలయం అధ్యక్షుడు సీతారాంరెడ్డి, పాలమూరు విశ్వవిద్యాలయం జహీర్‌అక్తర్, శాతవాహన విశ్వవిద్యాలయం నుంచి మణీందర్, అన్ని జిల్లాల నుంచి సభ్యులు పాల్గొన్నారు. రాష్ట్రంలోనివివిధ ప్రాంతాలల నుంచి ప్రైవేట్ జూనియర్ కళాశాలల యాజమాన్య ప్రతినిధులు హాజరయ్యారు. ఈ సందర్బంగా నూతన అధ్యక్షుడిగా బాలకృష్ణారెడ్డిని ఎన్నుకున్నారు. ఈ సందర్బంగా బాలకృష్ణారెడ్డి మాట్లాడుతూ త్వరలోనే అన్ని జిల్లాల వారీగా అసోసియేషన్ సభ్యత్వాన్ని నిర్వహించి అసోసియేషన్‌ను మరింత బలపేతం చేయడానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానన్నారు.

# ప్రజావాణికి 1509 దరఖాస్తులు

హైదరాబాద్,మార్చి 1,ప్రభాతవార్త: మహాత్మాజ్యోతిబాపూలే ప్రజాభవన్ శుక్రవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 1509 దరకృాస్తులు అందాయి. దఅందులో రెవెన్యూ పరమైన సమస్యలకు సంబంధించి 275, రేషన్‌కార్డుల కొరకు 107, ఇందిరమ్మ ఇండ్ల కోసం 396 ఉన్నాయి. వీటిని రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు డా.చిన్నారెడ్డి, ప్రజావాణి ప్రత్యేక అధికారి దివ్య ఇతర అధికారులు ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. కేవలం వ్యక్తిగత దరఖాస్తులే కాఉండా వివిధ ఉద్యోగ సంఘాల నుంచి కూడా దరఖఖాస్తులు అందాయి. అందులో ముఖ్యంగా డిఎస్‌సి 2008 బిఇడి మెరిట్ అభ్యర్థుల సంఘం నాయకులు చిన్నారెడ్డిని కలిసి తమ సమస్యలను వివరించారు. అలాగే ప్రభుత్వ పాఠశాలలో ఉన్న దివ్యాంగ విద్యార్థులకు బోధన చేస్తున్న కాంట్రాక్ట్ టీచర్లు తమపోస్టులను క్రబద్ధీకరించాలని విన్నవించారు.



బోయిన్‌పల్లి మార్కెట్ వద్ద అంబేద్కర్‌కు నివాళులర్పిస్తున్న ఎమ్మార్పీఎస్ నేతలు ఇటుక శ్రీ కిషన్ మాదిగ తదితరులు

# మాదిగ అమర వీరుల త్యాగాలు చిరస్థాయిగా నిలుస్తాయి : ఇటుక శ్రీ కిషన్

కంటోన్మెంట్, మార్చి 1 ప్రభాతవార్త: ఎస్సీ వర్గీకరణ సాధనలో అసువులు బాసిన మాదిగ అమర వీరుల త్యాగాలు చిరస్థాయిగా నిలుస్తాయని మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి కంటోన్మెంట్ ఇన్‌ఛార్జి ఇటుక శ్రీ కిషన్ మాదిగ తెలిపారు. మాదిగ అమర వీరుల దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం బోయిన్‌పల్లి మార్కెట్ వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహం వద్ద మాదిగ అమర వీరులకు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు మంద మధుకర్ మాదిగ, అక్షిత్ కళ్యాణ్, బ్యాగరి నరి సింహ్మా, విష్ణు మాదిగ,మక్కల అశోక్ తదితరులు పాల్గొన్నారు.

# లష్కర్ జిల్లా ఏర్పాటు చేయాలి



మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న లష్కర్ జిల్లా సాధన సమితి నాయకులు

సికింద్రాబాద్, మార్చి 1 ప్రభాతవార్తః లష్కర్ (సికింద్రాబాద్) జిల్లాను ఏర్పాటు చేయాలని కోరుతూ శుక్రవారం సచివాలయంలో హైదరాబాద్ జిల్లా ఇంచార్జి మంత్రి పొన్న ప్రభాకర్‌ను జిల్లా సాధన సమితి అధ్యక్షుడు గుర్రం పవన్‌కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో కలిసి వినతిపత్రం అందజేశారు. జిల్లా ఏర్పాటు ఆవశ్యకత గురించి మంత్రికి వివరించారు. జిల్లా ఏర్పాటు విషయాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్తానని, పార్లమెంట్ ఎన్నికల అనంతరం ప్రజలకు ఆమోదయోగ్యమైన నిర్ణయాన్ని ప్రభుత్వం తీసుకుంటుందని మంత్రి తెలిపారు. ఈ కార్యాక్రమంలో సమితి ప్రధానాకార్యాదర్శి బాలరాజ్ యాదవ్, ఉపాధ్యక్షుడు శైలేందర్, శ్రీకాంత్‌రెడ్డి, రవీందర్‌సాగర్, కృష్ణ ముదిరాజ్, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

# ఆలయానికి లైటింగ్, పెయింటింగ్ ఏర్పాటు చేయాలి



నిజాంపేట్, మార్చి 1, ప్రభాతవార్త : రాజీవ్ గృహకల్ప శివాలయ కమిటీ సభ్యులు శుక్రవారం ఆలయ చైర్మన్ కొలన్ శ్రీనివాస్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసారు. ఈ సందర్భంగా రానున్న శివరాత్రి పర్వదినం సందర్భంగా ఆలయానికి లైటింగ్, పెయింటింగ్‌ను ఏర్పాటు చేయాలని కోరారు. శ్రీనివాస్‌రెడ్డి స్పందిస్తూ వెంటనే పనుల కొరకు చర్యలు తీసుకుంటానని తెలిపారు. శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆలయానికి వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఆలయ కమిటీ సభ్యులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రెసిడెంట్ పితాని శ్రీనివాస్, వైస్ ప్రెసిడెంట్ శ్యామల, లక్ష్మణరావు పాల్గొన్నారు.

# మల్లన్నస్వామి కల్యాణ మహోత్సవానికి ముస్తాబైన దేవాలయం



యూసుఫ్‌గూడ, మార్చి 1, ప్రభాతవార్త : బోరబండ ఎన్ఆర్ ఆర్‌పురం సైట్2 కాలనీ లోని శ్రీశ్రీశ్రీ భ్రమ రాంబ మల్లీకార్జున స్వామి దేవస్థానంలో మల్లన్న స్వామి 16వ కళ్యాణ మహోత్సవం ఈనెల 2 శనివారం నుంచి 4వ తేదీ సోమవారం వరకు అంగరంగ వైభవంగా జరగనున్నది. 2వ తేదీ శనివారం ఉదయమే గంగ తెప్పోత్సవం, 3వ తేదీ ఆదివారం ఉదయం 11 గంటలకు స్వామివారి కళ్యాణం అన్నదాన కార్యక్రమం మధ్యాహ్నం 1 గంటకు పెద్దపట్నం, 2 గంటలకు అగ్నిగుండాలు, గొలుసు తెంపుట, సాయంత్రం 4 గంటలకు శ్రీ మల్లన్నస్వామి బోనాలు, 6 గంటలకు ఎల్లమ్మతల్లి బోనాలు 4వ తేదీ సోమవారం ఉదయం నాగవల్లి పూజా కార్యక్రమాలు ఉంటాయని నిర్వాహకులు పేర్కొన్నారు. ఈ ఆలయానికి 50 ఏళ్లకు పైబడి చరిత్ర ఉంది. ఎంతో పురాతనంగా ఉన్న మల్లికార్జునస్వామి దేవాలయం కోరిన వారి కోరికలు తీరుస్తూ ఎంతో మహిమలతో కలిగిఉండటంతో నగర నలుమూల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు ఈ వేడుకల్లో పాల్గొంటుంటారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ మానుక మహేష్ యాదవ్, అధ్యక్షులు సలేంద్రి ఆంజనేయులు యాదవ్, వర్కింగ్ ప్రెసిడెంట్ మేకల శంకర్‌యాదవ్, సలహాదారులు గుంటి కృష్ణ యాదవ్, వైస్ చైర్మన్ శివన్నయాదవ్, జనరల్ సెక్రటరీ బస్తీరాజు వీరేష్‌యాదవ్, ఉపాధ్యక్షులు రవీంద్ర యాదవ్, సత్యనారాయణ యాదవ్, కమలాకర్ యాదవ్, బలరాజు యాదవ్, నర్సింగ్ యాదవ్, జాయింట్ సెక్రటరీలు బండారి విఠల్ యాదవ్, రాజేష్ యాదవ్, గడ్డం సుధాకర్ యాదవ్, పరమేష్ యాదవ్, కోశాధికారి సర్వ శ్రీనివాస్ యాదవ్ పాల్గొన్నారు.



గండిపేట్ గ్రామం ఖానాపూర్‌లో సైబర్‌క్రైమ్, రోడ్డు ప్రమాదాలపై విద్యార్థులకు అవగాహన కల్పించి, హెల్మెట్‌ను అందజేస్తున్న నార్సింగి పోలీసులు

# ఘనంగా శివపార్వతుల కల్యాణం



చింతల్ రంగానగర్ శ్రీ సీతారామంజనేయ రామలింగేశ్వర స్వామి దేవాలయ ప్రాంగాణంలో ఘనంగా శ్రీ శివపార్వతుల కళ్యాణం కుత్బుల్లాపూర్ శాసనసభ్యులు కె.పి.వివేకానంద్ ప్రత్యేక పూజలు

కుత్బుల్లాపూర్, మార్చి 1 ప్రభాతవార్త: చింతల్ రంగానగర్ కాలనీలో వెలసిన శ్రీ సీతారామంజనేయ రామలింగేశ్వర స్వామి దేవాలయ ప్రాంగణంలో శ్రీ శివపార్వతుల కళ్యాణం ఘనంగా నిర్వమించారు. రంగానగర్ కాలనీ సంక్షేమ సంఘ అధ్యక్షులు బండారు వర ప్రసాద్‌గుప్తా ఆధ్వర్యంలో ఆలయ కమిటీనిర్వాహకులతో కలిసి ఈ కళ్యాణోత్సవంలో పాల్గొన్న కుత్బుల్లాపూర్ శాసనసభ్యులు కె.పి.వివేకానంద్ ప్రత్యేకపూజలు చేసి కార్యక్రమంలో భాగంగా దార్మికరత్న భక్తనిధి, ప్రీ జగదాంబ త్రిశక్తి పీఠాదిపతి బ్రహర్షి తాళ్లూరి బెనారస్ బాబుచేతుల మీదుగా ఎంఎల్ఎ కెపి.వివేకానంద్, భక్తులు ఆశీర్వచనాలను స్వీకరించారు. ఈసందర్భంగా కె.పి.వివేకానంద్ మాట్లాడుతూ ఆధ్యాతికతకు చిరునామాగా మారిన శ్రీ సీతారా మంజనేయ రామలింగేశ్వర స్వామి దేవాలయ ప్రాంగాణంలో నిర్వ హించిన శ్రీ శివపార్వతుల కళ్యాణం ఆనందాన్ని కలిగించిందన్నారు. కార్యక్రమాన్ని నిర్వహించిన నిర్వాహకులు బండారు వరప్రసాద్‌గుప్తా , సంక్షేమ ప్రతినిధులను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ వైస్‌చైరెన్ టి.లక్ష్మారెడ్డి, రంగానగర్ సంక్షేమ సంఘ అద్యక్షులు బండారు వరప్రసాద్‌గుప్తా, ప్రధానకార్య దర్శి లక్ష్మన్‌రావు, రామ్‌ప్రసాద్, సత్యనారాయణ,సతీష్, పద్మజారెడ్డి, శాంత, అనంత రావు, రామకృష్ణ, ఎల్లప్ప, సదానంద్, సరోజ ఆధ్వర్యంలో ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. రంగా నగర్ సంక్షేమ సంఘ అధ్యక్షులు బండారు వరప్రసాద్‌గుప్తా మాట్లా డుతూ విగ్రహ ప్రతిష్టాపనలో పాల్గొన్న రంగానగర్ వాసులతో పాటు చుట్టుపక్కల కాలనీలు, బస్తీలనుండి వచ్చిన భక్తులకు, ముఖ్యంగా స్తానిక శాసనసభ్యులు కె.పి.వివేకానంద్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# డిఎస్సీని రద్దు చేసి టెట్.. 25 వేల టీచర్స్ పోస్టులకు నోటిఫికేషన్ విడుదల చేయాలి

**రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య హెచ్చరిక**



నిరసన కార్యక్రమంలో మాట్లాడుతున్న ఆర్.కృష్ణయ్య

సైఫాబాద్, మార్చి 1 ప్రభాతవార్త: రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన డిఎస్సీ నోటిఫికేషన్‌ను తక్షణమే రద్దు చేసి, టెట్ నోటిఫికేషన్‌ను విడుదల చేసి 25 వేల టీచర్ పోస్టులను భర్తీ చేయాలని లేని పక్షంలో మార్చి 4న రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున వేలాది మంది నిరుద్యోగులతో నిరసన ఆందోళనలు చేపడతామని రాజ్యసభ సభ్యుడు, జాతీయ బిసి సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య హెచ్చరించారు. ఈ మేరకు శుక్రవారం తెలంగాణ నిరుద్యోగ జెఎసి ఛైర్మన్ నీల వెంకటేష్ ఆధ్వర్యంలో వందలాది మంది నిరుద్యోగులు సైఫాబాద్‌లోని రాష్ట్ర విద్యా శాఖ కమిషనర్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టిన సందర్బంగా ఆయన మాట్లాడారు. టెట్, డిఎస్సీ నోటిఫికేషన్ ఒకే సారి వేయడానికి ప్రభుత్వాని ఉన్న అభ్యంతరం ఏమిటని ఆయన ప్రశ్నించారు. గతంలో వేసిన టెట్‌లో కేవలం 10 శాతం మంది మాత్రమే పరీక్ష పాసైనారని 90 మంది ఫెయిల్ అయినారని విచారం వ్యక్తం చేశారు. బిఆర్ఎస్ ప్రభుత్వాన్ని గద్దె దించి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని తెచ్చుకుంటే ప్రజా ప్రభుత్వం పేరుతో నిరుద్యోగులను మోసం చేస్తున్నదని ఆరోపించారు. ఈ ధర్నాలో నీల వెంకటేష్, బిసి నాయకుల సి.రాజేందర్, జిల్లపల్లి అంజీ, రాజ్‌కుమార్, పలు జిల్లాల నుంచి వచ్చిన నిరుద్యోగులు పాల్గొన్నారు.

# బుడిబుడి పదవిన్యాస సవ్వడిలతో ఉర్రూతలూగించిన చిన్నారులు



రవీంద్రభారతి, మార్చి 1 ప్రభాతవార్త : ముద్దులొలికించే చిన్నచిన్న పదరవళితోనే కాదు బుడిబుడి అడుగుల పదవిన్యాస సవ్వడిల నృత్యాలతో రవీంద్రభారతి ప్రధాన వేదికతోపాటు ఆహుతులైన తల్లిదండ్రులు, తోటి చిన్నారులను ఉర్రూతలూగించారు స్లేట్ ద స్కూల్ ప్రీ ప్రైమరీ విద్యార్థులు తమ పాఠశాల వార్షికోత్సవ వేడుకల్లో. నర్సరీ, ఎల్‌కెజి, యుకెజికి చెందిన 416మంది చిన్నారులు తమ ప్రదర్శనలతో అదరగొట్టి హృదయాలను దోచుకున్నారు. ముఖ్యంగా తెలంగాణ పండుగలు బోనాలు, బతుకమ్మలతోపాటు బోలో తారా రారా, గల్ తీసే మిస్టేక్, రాకాసి గడుసుపిల్ల, భంభం భోలే, కాల ఛస్మా, జానీజానీ, దేశభక్తి, ఆధ్యాత్మిక వంటి వివిధ అంశాలతో నాట్యపరిమళాలను గుభాళింపజేశారు. ప్రదర్శనల ఆద్యంతం రవీంద్రభారతి వేదిక కేరింతలు, చప్పట్లతో మార్మోగిపోయింది.

# మొదటి తేదీ వేతనాల ఒరవడి కొనసాగించాలి

**పెండింగ్ కరువు భత్యం కూడా మంజూరీ చేయాలి : టియస్‌యుటిఎఫ్**

నిజాంపేట్, మార్చి 1, ప్రభాతవార్త : దాదాపు నాలుగున్నరేళ్ళ తరువాత రాష్ట్రంలోని ఉద్యోగ, ఉపాధ్యాయులందరికీ ప్రభుత్వం మొదటి తేదీ నాడే ఫిబ్రవరి నెల వేతనాలు ఖాతాల్లో జమ చేయడం హర్షనీయమని, రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటూ ఇదే ఒరవడిని కొనసాగించాలని వాయిస్ ఆఫ్ తెలంగాణ టీచర్ ప్రధాన సంపాదకులు పి.మాణిక్‌రెడ్డి తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ మేడ్చల్ మల్కాజగిరి జిల్లా అధ్యక్ష కార్యదర్శులు జయసింహారెడ్డి, పి.రమేశ్ కుమార్‌లు ఒక ప్రకటనలో తెలిపారు. గత మాసం జనవరి వేతనాలు ఫిబ్రవరి 2, 3 తేదీలలో చెలి ంచినప్పటికీ ఫిబ్రవరి మాసానికి సంబంధించి మార్చి ఒకటో తేదీనాడే పెన్షనర్లు, ఉపాధ్యాయులు, ఉద్యోగులందరికీ జమకావడం సానుకూల అంశమని వారు పేర్కొన్నారు. వీటితో పాటు రెండేళ్ళుగా పెండింగ్‌లో ఉన్న జిపిఎఫ్, పిఆర్‌సి బకాయిలు, డీఏ బకాయిల బిల్లులన్ని వెంటనే చెల్లించి క్లియర్ చేయాలని వారు ప్రభుత్వాన్ని కోరారు. ఇప్పటికే 3 వాయిదాల కరువుభత్యం పెండింగ్‌లో ఉన్నదని, 5శాతం మధ్యంతర భృతి పట్ల తీవ్ర నిరాశకు గురి అవుతన్న ఉద్యోగ వర్గాలకు వెంటనే 3 విడదల పెండింగ్ డిఏలను మంజూరి చేసి ఉపశమనం కలిగించాలని కోరారు.

# ఆకట్టుకున్న "అన్వేషన్ ఇన్నోవేషన్ ఫెయిర్ "

**40కిపైగా ప్రాజెక్టులను ప్రదర్శించిన విద్యార్థులు**



తాము రూపొందించిన ప్రాజెక్టు గురించి వివరిస్తున్న విద్యార్థులు

హైదరాబాద్, మార్చి 1,ప్రభాతవార్త: అగస్త్య ఇంటర్నేషనల్ ఆర్గనైజేషన్ - సినోప్సిన్ ఆధ్వర్యంలో గతరెండు రోజులుగా ఖైరతాబాద్‌లోని వెరాక్షగుండం విశేశ్వరయ్య భవన్‌లో నిర్వహించిన అన్వేషన్ ఇన్నోవేషన్ ఫెయిర్ అందరినీ ఆకట్టుకుంది. దాదాపు 25 ఇంజనీరింగ్ కాలేజీలనుంచి విద్యార్థులు ,హైస్కూల్ విద్యార్థులతో కలిసి రూపొందిచిన 40 వివివిధ రకాల ఇన్నోవేషన్ ప్రాజెక్టులను ఇక్కడ ప్రదర్శించారు. ఈసందర్భంతగా విద్యార్థులు హెల్త్,అగ్రికల్చర్, మెకానికల్, టెక్నాలజీకిసంబంధించి తాము రూపొందించిన ప్రాజెక్టుల వివరాలను వివరించారు. అనంతరం ప్రదర్శనలోని 10మంది విద్యార్థులను ఎంపిక చేసి వారికి బహుమతులు సర్టిఫికేట్లు అందజేశారు.రెండు రోజుల్లో దాదాపు 2వేలమంది విద్యార్థులు ఈప్రదర్శనను తిలకించినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈకార్యక్రమంలో ఐఐటి హైదరాబాద్ డైరెక్టర్‌తోపాటు ప్రతినిధులు రఘునందన్, శ్రీశైల్, బలరాం, ద్వివేది తదితరుల పాల్గొన్నారు.

# తాగిన మత్తులో గొడవ.. ఒకరి హత్య

కంటోన్మెంట్, మార్చి1 ప్రభాతవార్త: తాగిన మత్తులో ఇరువురు గొడవపడి ఓ వ్యక్తి హత్యకు గురైన సంఘటన మారేడ్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ నోముల వెంకటేశ్ కథనం ప్రకారం.. వెస్ట్ మారేడ్‌పల్లి పిట్టల బస్తీ జనా అపార్ట్‌మెంట్ సమీపంలో నివాసం ఉంటున్న మహ్మద్ ఇమ్రాన్ (25), అదే ప్రాంతానికి చెందిన సందీప్ అనే ఇద్దరు వ్యక్తులు గత కొన్ని సంవత్సరాల నుంచి స్నేహితులుగా కలిసి మెలిసి ఉంటున్నారు. గురువారం అర్ధరాత్రి ఇరువురు తాగిన మైకంలో గొడవపడ్డారు. సందీప్ వద్ద ఉన్న పదునైన చాక్‌తో ఇమ్రాన్‌ను పొడవడంతో తీవ్రగాయాలపాలై అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ కేసును ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్ ఆధ్వర్యంలో ఎస్.లక్ష్మి నారాయణ దర్యాప్తు చేస్తున్నారు.

# గంజాయి స్వాధీనం

కెపిహెచ్‌బి కాలనీ, మార్చి 1, ప్రభాతవార్త: గుట్టు చప్పుడు కాకుండా గంజాయి విక్రయిస్తున్న ఇద్దరు నిందితులను సైబరాబాద్ ఎస్‌ఓటి పోలీసులు పట్టుకుని వారి వద్ద నుంచి గంజాయి స్వాధీనం చేసుకున్నారు. స్థానికులు ఇచ్చిన కచ్చితమైన సమాచారం మేరకు మేడ్చల్ ఎస్‌ఓటి టీమ్ కెపిహెచ్‌బి కాలనీ పోలీస్ స్టేషన్ పరిధిలోని శ్రీవేదా హాస్టల్‌లో ఉంటున్న నందిగామ సాయితేజ (పాత నేరస్థుడు) కొత్తపల్లి నాగ శ్రీనివాస్ అనే ఇద్దరు యువకులను పట్టుకుని వారు ఉంటున్న రూమ్ నెంబర్ 301నుండి అమ్మకానికి సిద్ధం చేసిన 750 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కెపిహెచ్‌బి కాలనీ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# దేశంలో మహిళలపై అత్యాచారాలు, దాడులను తిప్పికొట్టేందుకు ఆందోళనలు

**మహిళా కాంగ్రెస్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షురాలు పుస్తకాల కవిత**

చిక్కడపల్లి, మార్చి 1 ప్రభాతవార్త: దేశంలో మహిళలపై హింస రోజురోజుకు పెరుగుతోందని, ఇది భయంకరమైన వాస్తవం అని మహిళా కాంగ్రెస్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షురాలు పుస్తకాల కవిత అన్నారు. హత్రాస్, ఉన్నావ్, బాజు భూషణ్‌సింగ్ వంటి ఉదంతాలు ఈ సంక్షోభం తీవ్రతను మరింత ఎత్తిచూపుతున్నాయన్నారు. శుక్రవారం సాయంత్రం ఆర్టీసిక్రాస్‌రోడ్స్‌లో మహిళా కాంగ్రెస్ జాతీయ అధ్యక్షురాలు అల్కా లాంబ, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షురాలు సునీతారావు ఆదేశాలమేరకు ఏరానపటఉ చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బిజెపిప్రభుత్వం మద్దతుతో పోలీసుల ఉదాసీనత వల్ల 2020లో దళిత మహిళలపై సామూహిక అత్యాచారం, హత్య, కుల హింస క్రూరత్వాన్ని ఎత్తిచూపుతుందని అనాననరు. ఉన్నావ్‌లో బిజెపి ఎమ్మెల్యే మైనర్ బాలికపై అత్యాచారం చేయడం, సాక్షుల అనుమానాస్పద మృతి వంటి కేసులు ప్రభుత్వానికి వ్యతిరేకంగా గళం విప్పడం వల్ల తీవ్ర పరిణామాలు చోటుచేసుకున్నాయని ఆవేదన వ్యక్తంచేశారు. ఈ వ్యవస్థను అంతం చేయడానికి దేశంలో బహుముఖ వ్యూహం ఎంతో అవసరమని డిమాండ్ చేశారు.

# ఉచిత కంటి వైద్య శిబిరంకు విశేష స్పందన



కోకాపేట్‌లో ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిబిరంలో పాల్గొన్న పిసిసి ప్రతినిధి ముంగి జైపాల్‌రెడ్డి

నార్సింగి, మార్చి 1 ప్రబాతవార్త : గండిపేట మండలం కోకాపేట్‌లో ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన వచ్చింది. శంకరకంటి ఆసుపత్రి నిర్వాహకులు పేదలకు ఉచితంగా కంటి వైద్యంను అందించేందుకు ఈ వైద్య శిబిరంను నిర్వహించారు. ఈ వైద్య శిబిరంను పిసిసి ప్రతినిధి, కోకాపేట్ మాజీ సర్పంచ్ ముంగి జైపాల్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుపేదలకు ఉచిత వైద్యంను అందించేందుకు ముందుకు వచ్చిన కార్పోరేట్ ఆసుపత్రి నిర్వాహకులను అభినందిస్తున్నామన్నారు. సంపాదనే ధ్యేయంగా పని చేస్తున్న నేటి రోజుల్లో సేవా మార్గంలో కార్పోరేట్ ఆసుపత్రి యాజమాన్యం పయనిస్తుండడం శుభ పరిణామమన్నారు. ప్రజలు ప్రతీ ఆరు నెలలకు ఒక సారి తమ కంటి చూపును పరీక్షించుకోవాలన్నారు. కంటి చూపు ఉంటేనే అందమైన ఈ ప్రకృతిని చూడగలుగుతామని, చూపు మందగిస్తే మన పనులు మనం చేసుకోవడం కష్టతరమవుతుందన్నారు. శుక్లాలు, గ్లూకోమా వంటి వ్యాధులను సకాలంలో గుర్తించి శస్త్ర చికిత్సలు చేయించుకుంటే చూపు ఉంటుందని లేదంటే చూపును కోల్పోయే ప్రమాదముందన్నారు. అత్యాధునిక వైద్య పరికరాలతో కోకాపేట్‌లోనే శంకర కంటి ఆసుపత్రి ప్రారంభం కావడం, పేదలకు నామ మాత్రపు ఫీజులు, ఉచితంగా కూడా వైద్యంను అందిస్తుండడం ఆహ్వానించదగ్గ పరిణామమన్నారు. స్థానిక ప్రజలంతా ఈ ఆసుపత్రికి వెళ్లి కంటి వైద్యను పొందాలని జైపాల్‌రెడ్డి సూచించారు. ఈ కార్యక్రమంలో కంటి ఆసుపత్రి వైద్య నిపుణులు, కోకాపేట్ గ్రామ పెద్దలు ఓంప్రకాశ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మేడిగడ్డ సందర్శనకు బిఆర్ఎస్ నేతలు



మేడిగడ్డ సందర్శనకు వెళుతున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి తదితరులు

**ఉప్పల్, మార్చి 1 ప్రభాతవార్త :** మేడిగడ్డ సందర్శనకు ఉప్పల్ నియోజకవర్గం నుంచి పలువురు పార్టీ నేతలు ర్యాలీగా తరలివెళ్లారు. ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో పలువురు పార్టీ నేతలు, కార్యకర్తలు ర్యాలీగా బస్సులతో తెలంగాణ భవన్‌కు తరలివెళ్లారు. అక్కడి నుంచి మాజీ మంత్రి కేటిఆర్ నాయకత్వంలో పలువురు పార్టీ నేతలు బయలుదేరి వెళ్లారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ మేడిగడ్డలో నిజనిజాలు ప్రజలకు బయటపెట్టేందుకు పలువురు పార్టీ నేతలు వెళుతున్నారని తెలిపారు. మాజీ సిఎం కెసిఆర్ ఎంతో కష్టపడి తెలంగాణ ప్రజల కష్టనష్టాలు తీర్చేందుకు మేడిగడ్డ నిర్మించారని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ నేతలు కావాలనే బిఆర్ఎస్ పార్టీపై దుష్ప్రచారం చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపి రావుల చంద్రశేఖర్‌రెడ్డి, బిఆర్ఎస్ నేతలు పి.జితేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## నాదర్‌గుల్ ఎంవిఎస్ఆర్‌లో డ్యాప్కామ్-24 అంతర్జాతీయ సదస్సు



సదస్సులో ప్రసంగిస్తున్న ఓయు రిజిస్ట్రార్ లక్ష్మీనారాయణ

**సరూర్‌నగర్, మార్చి 1 ప్రభాతవార్త:** నాదర్‌గుల్‌లోని ఎంవిఎస్ఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో గురువారం డేటా ఆక్విసిషన్ ప్రాసెసింగ్ అండ్ కమ్యూనికేషన్ (డ్యాప్కామ్-24)పై అంతర్జాతీయ సదస్సు జరిగింది. మూడు రోజుల పాటు జరిగే ఈ సదస్సుకు తొలిరోజు ముఖ్యఅతిథిగా హాజరైన ఉస్మానియా యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.లక్ష్మీనారాయణ హాజరై ఎంవిఎస్ఆర్ ఎడ్యుకేషన్ సొసైటీ ఛైర్మన్ కెవిఆర్ కశ్యప్ తదితరులతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ అంతర్జాతీయ స్థాయిలో సదస్సును నిర్వహించడం అభినందనీయమన్నారు. కాగా ఈ సదస్సుకు దేశ విదేశాలనుండి సుమారు 600మందికిపైగా రచయితలు తమ ఆవిష్కరణలు పంపారు. వాటిలో 23 యుజిసికి ఎంపికయ్యాయి. ఈ సదస్సును రుమానియా దేశానికి చెందిన గలాటి యూనివర్సిటీ ప్రొఫెసర్ మోరారు లుమినిటా పర్యవేక్షించారు. ఈ సదస్సు ప్రారంభోత్సవంలో మాతృశ్రీ సొసైటీకి చెందిన జూపూడి సుధాకర్, వాసుదేవరావు, పార్థసారథి, హిరణ్మయి, ఉమాదేవి, కాలేజీ ప్రిన్సిపాల్ కనకదుర్గ, వైస్ ప్రిన్సిపాల్ ఎస్‌జివిఎస్ మూర్తి, కాన్ఫరెన్స్ ఛైర్మన్, సిఎస్ఇ విభాగం హెచ్‌ఓడి ప్రసన్నకుమార్, వివిధ రాష్ట్రాల యూనివర్సిటీల ప్రొఫెసర్లు, డిఫెన్స్ సంస్థల శాస్త్రవేత్తలు, కాలేజీ హెచ్‌ఓడిలు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## సైదాబాద్‌కు ఎయిర్‌టెక్ మిషన్‌ను కేటాయించాలి: కార్పొరేటర్ అరుణ



జిఎంకు వినతిపత్రం అందజేస్తున్న కార్పొరేటర్ కొత్తకాపు అరుణ

**సైదాబాద్, ఫిబ్రవరి 29 ప్రభాతవార్త:** డ్రైనేజీలు శుభ్రం చేయడం కోసం సైదాబాద్ సెక్షన్‌కు ప్రత్యేకంగా ఎయిర్‌టెక్ వాహనాన్ని కేటాయించాలని కార్పొరేటర్ కొత్తకాపు అరుణ రవీందర్‌రెడ్డి శుక్రవారం జిఎం ఖదీర్ మొహినుద్దీన్‌కు వినతిపత్రంన అందజేశారు. మాధవనగర్‌లో నూతనంగా త్రాగునీటి పైపులైన్‌ను, శంకేశ్వర్‌బజార్‌లో, మూడు గుళ్ల నుంచి ఏకలవ్యనగర్ వరకు నూతనంగా డ్రైనేజీ పైపులైన్ మంజూరు చేయాలని జిఎంను కార్పొరేటర్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో ఓబిసి మోర్చా కన్వీనర్ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

## వన్ టైం పథకాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి : డిసి జయంత్

**మలక్‌పేట, మార్చి 1 ప్రభాతవార్త :** ఆస్తి పన్ను యొక్క పేరుకుపోయిన బకాయిలు 2022-23 సంవత్సరానికి సంబంధించి అపరాధ రుసుములో 90 శాతం మాఫీతో కేవలం 10 శాతం అపరాధ రుసుము మాత్రమే చెల్లించాలని ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మలక్‌పేట సర్కిల్-6 డిప్యూటీ కమిషనర్ జయంత్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆస్తి పన్ను చెల్లింపుదారులకు ఆస్తి పన్ను చెల్లించడానికి వారిని ప్రోత్సహించడానికి వన్ టైమ్ స్కీం పథకం క్రింద బకాయిలు ఉన్నవారికి 90 శాతం అపరాధ రుసుము మాఫీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. సకాలంలో పన్నులు చెల్లించి గ్రేటర్ అభివృద్ధికి తోడ్పడాలని డిప్యూటీ కమిషనర్ జయంత్ పేర్కొన్నారు.

## మార్చి 7వ తేదీనుండి శ్రీవారి బ్రహ్మోత్సవాలు : దొంతుల రాజశేఖర్‌రెడ్డి



బ్రహోత్సవాలను కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న సభ్యులు

**మలక్‌పేట, మార్చి 1 ప్రభాతవార్త :** మార్చి 7వ తేదీనుండి జూబ్లీహిల్స్ శ్రీ వెంకటేశ్వరస్వామి 4వ వార్షికోత్సవ శ్రీవారి బ్రహ్మోత్సవాలను నిర్వహించనున్నట్లు దేవాలయ లోకల్ అడ్వయిజరీ కమిటీ ఉపాధ్యక్షుడు దొంతుల రాజశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. మార్చి 7వ తేదీన అంకురార్పణతో వేడుకలు ప్రారంభమై 17వ తేదీవరకు అనేక పూజా కార్యక్రమాలతోపాటు స్వామివారికి సేవలు నిర్వహిస్తున్నామని భక్తులు పెద్ద ఎత్తున హాజరై కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమలంలో ఎల్ఎసి ఉపాధ్యక్షుడు రాఘవేందర్, టిటిడి డిప్యూటీ ఇఓ రమేష్‌బాబు, రంగు వెంకటేష్‌గౌడ్, ఉమా కౌడి, భోజిరెడ్డి, వెంకట చలపతి, పూర్ణచందర్, షణ్ముకేశ్వరదాస్, అనూప్ చక్రవర్తి, నరేందర్‌రెడ్డి, శివగణేష్, టిటిడి అధికారులు నిరంజన్, హరి తదితరులు పాల్గొన్నారు.

## గృహజ్యోతి సంక్షేమ పథకం నిరుపేదలకు వరం : ఎం.పరమేశ్వర్‌రెడ్డి



స్వీట్లు పంపిణీ చేస్తున్న కాంగ్రెస్ నేత ఎం.పరమేశ్వర్‌రెడ్డి తదితరులు

**ఉప్పల్, మార్చి 1 ప్రభాతవార్త :** రాష్ట్రంలో సిఎం రేవంత్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు పేద, మధ్య తరగతి వర్గాలకు వరంగా మారుతున్నాయని ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ఎం.పరమేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం ఉప్పల్‌లో గృహజ్యోతి పథకం అమలు సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సంబరాలు చేసుకున్నారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో గృహజ్యోతి పథకం కింద 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. రూ.500 గ్యాస్ సిలిండర్ పథకం ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇప్పటికే రెండు పథకాలు అమలవుతుండగా కొత్తగా మరో రెండు పథకాలు తీసుకుని రావడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ పార్టీ నేతలు సి.రఘుపతిరెడ్డి, బజారు జగన్‌గౌడ్, ఆగంరెడ్డి, మహేష్, రాజేష్, బూర్గుల రమేష్,బొట్టు రాజేష్, మంచాల రఘు, పల్లె రమేష్‌గౌడ్, సుశీల, అమర్, సత్యం తదితరులు పాల్గొన్నారు.

## ఈ నెల 11న మీర్‌పేట్ కార్పొరేషన్ మేయర్‌పై అవిశ్వాసంపై ప్రత్యేక సమావేశం



మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్

**సరూర్‌నగర్, మార్చి 1 ప్రభాతవార్త:** మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ ముడావత్ దుర్గదీప్‌లాల్‌చౌహాన్‌పై మెజార్టీ కార్పొరేటర్లు ప్రకటించిన అవిశ్వాసంపై ఈ నెల 11వ తేదీన ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించనున్నారు. ఈ మేరకు రంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రత్యేక సమావేశానికి సంబంధించి నోటీసులు జారీ చేశారు. మొత్తం 46 మంది కార్పొరేటర్లు ఉన్న మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌కు మేయర్‌గా బిఆర్ఎస్ పార్టీకి చెందిన ముడావత్ దుర్గ దీప్‌లాల్ చౌహాన్ ఉన్నారు. అయితే ఆమెపై గత కొంత కాలంగా అసంతృప్తితో ఉన్న కార్పొరేటర్లు అవిశ్వాసం ప్రకటించి అందుకు సంబంధించిన తీర్మాణం లేఖను రంగారెడ్డి జిల్లా కలెక్టర్ శశాంకకు అందజేశారు. మేయర్‌పై అవిశ్వాసానికి సంబంధించిన తీర్మాణం లేఖలో ప్రతిపక్ష బిజెపి, కాంగ్రెస్ పార్టీలకు చెందిన కార్పొరేటర్లతో పాటు బిఆర్ఎస్ పార్టీకి సంబంధించిన పలువురు కార్పొరేటర్లు కూడా ఉండడం కార్పొరేషన్‌లో చర్చనీయాంశమైంది. మొత్తం 46 మంది కార్పొరేటర్లతో 31 మంది కార్పొరేటర్లు సంతకాలు చేయడం జరిగింది. ఈ క్రమంలో రంగారెడ్డి జిల్లా కలెక్టర్ అవిశ్వాసం తీర్మాణం లేఖలో కార్పొరేటర్ల సంతకాలు సరైనవా? కావా? అనే విషయాన్ని నిర్ధారణ చేసుకున్న అనంతరం అవిశ్వాసంపై తేదీని ప్రకటించారు. ఈ మేరకు ఈ నెల 11వ తేదీ సోమవారం ఉదయం 11 గంటలకు మీర్‌పేట్‌లోని కార్పొరేషన్ కార్యాలయంలో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేయనున్నారు. ఇప్పటికే కార్పొరేటర్లకు సమావేశానికి సంబంధించిన నోటీసులు కూడా జారీ అయ్యాయి.

## బాలాపూర్ చౌరస్తాలో మాదిగ అమర వీరుల సంస్మరణ దినోత్సవం



మాదిగ అమరవీరులకు నివాళులర్పిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

**సరూర్‌నగర్, మార్చి 1 ప్రభాతవార్త:** మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని బాలాపూర్ చౌరస్తాలో శుక్రవారం ఎమ్మార్పీఎస్ ఉద్యమంలో అమరులైన మాదిగల సంస్మరణ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ పిలుపు మేరకు శుక్రవారం మాదిగ అమర వీరులకు పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు. ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి హాజరైన నాయకులు మాదిగ అమర వీరులను స్మరించుకొని వారి త్యాగాలను గుర్తు చేశారు. కార్యక్రమంలో నాయకులు బొర్ర రవి మాదిగ, వీర్లపల్లి కిష్టయ్య, చింతుల్ల చిన్న, అడ్డాకుల సురేష్, డికె నర్సింహ, దాసరి మహేందర్, ఆలంపల్లి అంజయ్య, సూతరి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## వినియోగదారులకు నిరంతరం విద్యుత్ సరఫరా : డి హనుమంతరెడ్డి



డిఇ హనుమంతరెడ్డిని సన్మానిస్తున్న రామకృష్ణానంద్ తదితరులు

**మలక్‌పేట, మార్చి 1 ప్రభాతవార్త :** విద్యుత్ వినియోగదారులకు నిరంతర విద్యుత్‌సరఫరాను అందిస్తున్నామని అస్మాన్‌ఘడ్ డిఇ హనుమంతరెడ్డి పేర్కొన్నారు. అస్మాన్‌ఘడ్ విద్యుత్‌శాఖ కార్యాలయంలో గృహజ్యోతి పథకం గురించి అధికారులు, సిబ్బందితో కలిసి అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. అదేవిధంగా 1104 యూనియన్ తరపున ప్రధాన కార్యదర్శి రామకృష్ణానంద్ ఆధ్వర్యంలో హనుమంతరెడ్డి పుష్పగుచ్చాలను అందజేసి ఘనంగా సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగకుండా ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా తగిన చర్యలు చేపట్టాలని అధికారులు,సిబ్బందికి సూచించారు. అస్మాన్‌ఘడ్‌పరిధిలో సమ్మర్ ప్లాన్‌లో భాగంగా రూ. 2.43 కోట్లతో పలు అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. ప్రజలకు ఎళ్లవేళలా అందుబాటులో ఉండి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని ఏమైనా ఇబ్బందులు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఫ్లై ఓవర్ పనుల పురోగతిని సమీక్షించిన ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి



అధికారులకు సూచనలు చేస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

**సైదాబాద్, ఫిబ్రవరి 29 ప్రభాతవార్త:** బైరామల్‌గూడలో స్కై ఫ్లై ఓవర్ పనుల పురోగతిపై ఎల్‌బినగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి శుక్రవారం తన కార్యాలయంలో అధికారులతో సమావేశం నిర్వహించారు. బైరామల్‌గూడలో చేపట్టిన స్కై ఫ్లై ఓవర్ పనులు దాదాపు పూర్తి కావడం జరిగిందని, అయితే ఎల్‌బినగర్ నుంచి చంపాపేట వైపుకు వెళ్లే ఫ్లై ఓవర్ పనులు ఇంకా పూర్తి కాలేదని ఆ పనులను వెంటనే పూర్తి చేయాలని ఎమ్మెల్యే అధికారులను సూచించారు. ఎన్నికల కోడ్ వస్తే పనుల్లో వేగవతంగా జరుగవని, ఆ లోగా పనులను పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఇ రవీందర్ రెడ్డి, ఇఇ రోహిణి, డిఇ కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

## ఆదర్శవంతమైన డివిజన్‌గా తీర్చిదిద్దడమే తన లక్ష్యం : కార్పొరేటర్ సుజాతనాయక్



కార్పొరేటర్‌కు వినతి పత్రం సమర్పిస్తున్న కాలనీ సంక్షేమ సంఘం నాయకులు

**వనస్థలిపురం, మార్చి 1 ప్రభాతవార్త:** హస్తినాపురం డివిజన్ పరిధిలోని కాలనీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించనున్నట్లు కార్పొరేటర్ బానోతు సుజాత నాయక్ తెలిపారు. డివిజన్ పరిధిలోని ఇంద్రప్రస్థ కాలనీ ఫేస్2 కాలనీవాసుల విజ్ఞప్తి మేరకు శుక్రవారం కాలనీలో పర్యటించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షులు కాయితి శేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో కార్పొరేటర్ మాట్లాడుతూ కాలనీలో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రత్యేక నిధులు కేటాయించి కృషి చేయనున్నట్లు తెలిపారు. కాలనీలో పది లక్షలచే బీటీ రోడ్డు నిర్మాణం చేపట్టినందుకు కార్పొరేటర్‌కు కాలనీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కృతజ్ఞతలు తెలిపారు. కాలనీలో ఎక్కడ సమస్య ఉన్న తన దృష్టికి తెచ్చిన వెంటనే సంబంధిత అధికారులను వివరించి సమస్యను పరిష్కరించనున్నట్లు తెలిపారు. డివిజన్‌ను ఆదర్శవంతమైన డివిజన్‌గా తీర్చిదిద్దడమే తన లక్ష్యమన్నారు. ప్రధాన సమస్యల పరిష్కారం కోసం ప్రణాళికలు తయారుచేసి ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్లనున్నట్లు తెలిపారు. నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యలను పరిష్కరిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు గోపిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

## పార్టీ మారుతున్నట్లు జరుగుతున్న ప్రచారం అబద్ధం: కెఎల్ఆర్

**సరూర్‌నగర్, మార్చి 1 ప్రభాతవార్త:** తాను పార్టీ మారుతున్నట్లు జరుగుతున్న ప్రచారంలో వాస్తవం లేదనీ తాను కాంగ్రెస్ పార్టీని వీడే ప్రసక్తే లేదని మాజీ ఎమ్మెల్యే, మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ ఇంఛార్జి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి స్పష్టం చేశారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. పార్టీ మారుతున్నానని తప్పుడు ప్రచారం చేసి తన ప్రతిష్ట దెబ్బతీసే కుట్రలు చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. అసలు తనకు పార్టీ మారాల్సిన అవసరమే లేదనీ ఆయన తేల్చి చెప్పారు. అయితే తనపై కావాలని అసత్య ప్రచారం చేసే వారు న్యాయపరమైన చిక్కులు ఎదుర్కోవాల్సి వస్తుందని కెఎల్ఆర్ హెచ్చరించారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో చేవెళ్ళ పార్లమెంట్ నియోజకవర్గం నుండి కాంగ్రెస్ పార్టీ గెలిచే విధంగా కృషి చేస్తున్నామనీ దీనిని జీర్ణించుకోలేక బిజెపి, బిఆర్ఎస్ పార్టీలు కుమ్మక్కై తనపై విష ప్రచారం చేయిస్తున్నాయని ఆయన అన్నారు.

## వనస్థలిపురం పోలీస్‌స్టేషన్ నూతన ఇన్‌స్పెక్టర్‌గా అశోక్‌రెడ్డి

**వనస్థలిపురం, మార్చి 1 ప్రభాతవార్త:** వనస్థలిపురం పోలీస్‌స్టేషన్ నూతన ఇన్‌స్పెక్టర్‌గా వై.అశోక్‌రెడ్డి శుక్రవారం భాధ్యతలు చేపట్టారు. గతంలో వనస్థలిపురంపోలీస్‌స్టేషన్‌లో ఇన్‌స్పెక్టర్‌గా పనిచేసిన రవికుమార్ బదిలీపై యాదాద్రి ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్‌గా వెళ్లారు. ఈ సందర్భంగా నూతనంగా భాధ్యతలు చేపటిన అశోక్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజల సహకారంతో శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తానన్నారు. ఎల్లవేళలా ప్రజలకు అందుబాటులో ఉండి నేరాల అదుపునకు కృషి చేస్తానన్నారు.

## చంపాపేటలో జనతా ఫుడ్స్ సేమియా తయారీ కేంద్రంలో అధికారుల తనిఖీలు

**సైదాబాద్, ఫిబ్రవరి 29 ప్రభాతవార్త:** చంపాపేట సుల్తాన్‌వాల్యాలో జనతా ఫుడ్స్ పేరుతో సేమియాను తయారు చేస్తున్న కేంద్రంలో ఫుడ్ సేఫ్టీ అధికారులు, జిహెచ్ఎంసి అధికారులు తనిఖీ చేశారు. మురికి నీరు, దుర్వాసన, అపరిశుభ్రత మధ్య సేమియాను తయారు చేసి నిల్వ చేస్తుండడాన్ని గుర్తించిన అధికారులు సేమియా స్టాక్‌ను సీజ్ చేశారు.

## 3న ఉప్పల్‌లో అస్తి పన్ను పరిష్కార వేదిక

**ఉప్పల్, మార్చి 1 ప్రభాతవార్త :** ఉప్పల్ సర్కిల్‌లో అస్తిపన్ను చెల్లించేందుకు ఈనెల 3వ తేదిన సిటిజన్ సర్వీస్ సెంటర్లు తెరిచి ఉంచుతామని ఉప్పల్ డిప్యూటి కమిషనర్ అంజనేయులు తెలిపారు. సిటిజన్ సర్వీస్ సెంటర్‌లో ట్యాక్స్ ఇన్‌స్పెక్టర్లు, బిల్ కలెక్టర్లు అందుబాటులో ఉంటారని, ఆసిపన్నుకు సంబంధించి ఎలాంటి సమస్యలు ఉన్నా వాటిని వెంటనే పరిష్కరిస్తారని తెలిపారు. సర్కిల్ కార్యాలయంలో ఆదివారం ఉదయం 9 గంటలనుంచి మధ్యాహ్నం 1 గంటవరకు సర్కిల్ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.



కాళేశ్వరం ప్రాజెక్టుపై ప్రభుత్వం చేస్తున్న దుష్ప్రచారాన్ని తిప్పికొడుతూ బిఆర్ఎస్ పార్టీ తలపెట్టిన ఛలో మేడిగడ్డకు ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో డివిజన్ కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు, పార్టీ సీనియర్ నాయకులు, ఉద్యమకారులు, కార్యకర్తలు (మల్కాజిగిరి, ప్రభాతవార్త)

## లాలాపేట్ తార్నాక మీదుగా భారీ ర్యాలీగా బిజెపి విజయ సంకల్ప యాత్ర రోడ్ షో



విజయ సంకల్ప యాత్రలో పాల్గొన్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి తదితరులు

**తార్నాక, మార్చి 1 ప్రభాతవార్త:** బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి చేపట్టిన విజయ సంకల్ప యాత్ర రోడ్ షో శుక్రవారం లాలాపేట్, శాంతి నగర్, తార్నాక మీదుగా వెళ్ళింది. వందలాది మంది నాయకులు, కార్యకర్తలు, బైకులు, కార్లలో బిజెపి జెండాలతో యాత్ర కొనసాగింది. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి రోడ్డు గుండా ప్రజలకు నమస్కరిస్తూ షోలో వెళ్లారు. మంత్రికి స్వాగత స్టేజీలను ఏర్పాటు చేసి పూలు చల్లూతూ స్వాతగం పలికారు. జై మోది జై కిషన్ రెడ్డి అంటూ నినాదాలు చేస్తూ ర్యాలీగా నాయకులు వెళ్లారు. లాలాపేట్ అంబేద్కర్ విగ్రహానికి కిషన్ రెడ్డి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్, కంటెస్టడ్ ఎమ్మెల్యే మేకల సారంగపాణి, మాజీ మేయర్ బండ కార్తికరెడ్డి, నాయకులు పోచయ్య యాదవ్, వీరన్న, శారదమల్లేష్, రవిప్రసాద్ గౌడ్, నాగేశ్వర్‌రెడ్డి, శ్రీనివాస్‌చారి, వెంకటేష్‌గౌడ్, ఆకుల శ్రీనివాస్, జమ్మికుంట వేణు, రాముపర్మ,సుక్కగణేష్ ముదిరాజ్,ఉపేందర్ యాదవ్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

## ఘనంగా ప్రారంభమైన ప్రత్యంగిరా దేవాలయ వార్షిక బ్రహ్మోత్సవాలు



పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

**ఎల్.బి.నగర్,మార్చి 1 ప్రభాతవార్త:** ఆర్కేపురంలోని కుర్తాళంపీఠం శ్రీ ప్రత్యంగిరా పరమేశ్వరి దేవాలయ వార్షిక బ్రహ్మోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. అమ్మవారికి విశేష 18 రకముల ద్రవ్యములతో అభిషేకము, విశ్వాస్ గ్రూపు గాయత్రి ఫణిందర్ ఆధ్వర్యంలో మహిళలతో లలిత విష్ణు సహస్రనామ కుంకుమార్చన నిర్వహించారు. అమ్మవారు ప్రత్యేక అలంకరణలో దర్శనమిచ్చారు. ఆర్కె పురం డివిజన్ కార్పొరేటర్ రాధ ధీరజ్ రెడ్డి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ సెక్రెటరీ మునిపల్లె శ్రీనివాస్ వారికి ప్రసాదం అందచేశారు. ఈ కార్యక్రమంలో విఠల్ శర్మ, చాణక్య శర్మ, మునిపల్లె సువర్ణలత, అరుణ, హేమ, సాయికుమార్, హేమంత్, గోపాలకృష్ణ, శ్రీపతి పాల్గొన్నారు.

## హరిజన బస్తీకి చెందిన నిరుపేద కుటుంబానికి వాకర్స్‌టీమ్ చేయూత



అర్థిక సహాయం చేస్తున్న వాకర్స్ టీమ్ ప్రతినిధులు

**ఉప్పల్, మార్చి 1 ప్రభాతవార్త :** ఉప్పల్ డివిజన్ హరిజనబస్తీకి చెందిన వడ్డేపల్లి నరసింహ అనారోగ్యంతో మృతి చెందడంతో వారి కుటుంబ సభ్యులకు ఉప్పల్ మున్సిపల్ స్టేడియం వాకర్స్‌బీ టీమ్ ప్రతినిధులు చేయూత అందించారు. ఈ మేరకు వాకర్స్ టీమ్ ప్రతినిధులు అల్వాల్ నాగరాజు, అన్య బాలకృష్ణ, ఎల్లగోని ప్రకాష్‌గౌడ్, వెంకటేష్, శ్రీనివాస్, సురేష్‌గౌడ్, శ్రీనివాస్‌లు రూ.పది వేల అర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిరుపేద కుటుంబానికి చెందిన వడ్డేపల్లి నరసింహ అకస్మికంగా మృతి చెందారని, అతని కుటుంబాన్ని ఆదుకునేందుకు తమ వంతు చేయూత అందించినట్లు తెలిపారు. వాకర్స్ టీమ్ ఆధ్వర్యంలో పేదలకు తగు సహాయం అందజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలోవినాయక నగర్‌బస్తీ వాసులు మామిండ్ల రాజు, జగన్, చింటూ తదితరులు పాల్గొన్నారు.

## కబ్జాలు చేసి కట్టడాలు చేపట్టిన వారిపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తాం

**బోడుప్పల్, మార్చి 1 ప్రభాతవార్త :** పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని మేడిపల్లిలోని హెచ్ఎండిఏ లే అవుట్ హద్దులలో ఉన్న ప్లాట్లు ఆక్రమణకు గురవుతున్నాయని పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ కమిటీ ఆధ్వర్యంలో అధ్యక్షులు తుంగతుర్తి రవి నేతృత్వంలో అన్యాక్రాంతమవుతున్న ప్రభుత్వ భూములను పరిశీలించారు. కబ్జాలు చేసి అక్రమంగా కట్టడాలు చేపట్టిన భూ బకాసురుల పైన సమగ్ర సమాచారంతో కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని పేర్కన్నారు. ఈ కార్యక్రమంలో పన్నాల శ్రీనివాస్‌రెడ్డి, మోహన్, పవన్‌గౌడ్, నగేష్, రంజిత్‌రెడ్డి, ఐలేష్‌యాదవ్, జంగాచారి, కవిడె కుమార్, సుదర్శన్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ హామీ నిలబెట్టుకుంది : లింగాల



ఉచిత బిల్లు అందజేస్తున్న కిషోర్ గౌడ్

**ఎల్.బి.నగర్, మార్చి 1 ప్రభాతవార్త:** ఎన్నికలలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీని నిలబెట్టుకుని డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు లింగాల కిషోర్ గౌడ్ పేర్కొన్నారు. గృహజ్యోతి జీరో బిల్లుల పంపిణీ కార్యక్రమం శుక్రవారం కొత్తపేట డివిజన్ లోని పలు ప్రాంతాలలో విద్యుత్ సున్నా బిల్లులు పంపిణీ ప్రక్రియ ప్రారంభించారు. ఈ సందర్భంగా కిషోర్ గౌడ్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు ప్రభుత్వ అధికారులు 200 యూనిట్స్ లోపు ఉన్న అర్హులైన ప్రతి ఒక్కరికి సున్నా బిల్లులు ఇచ్చారని తెలిపారు. ఎల్బీనగర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి, తెలంగాణ కాంగ్రెస్ ప్రచార కమిటీ చైర్మన్ మధు యాస్కి గౌడ్ ఆదేశాల మేరకు నిత్యం ప్రజల కు అందుబాటులో ఉంటామని తెలిపారు. రేషన్ కార్డు ఉండి ఈ పథకం అమలు కాని వారు మరోసారి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.